ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 9 ఆగస్టు 2025

11న సీనియర్ బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీనియర్ బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నామని బేస్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చల్ల హరిశంకర్, ఎండీ యూనిస్‌పాషా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈనెల 16 నుంచి 18 వరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు 9866834675 నంబరులో సంప్రదించాలని సూచించారు.

జిల్లాకు రెండు జాతీయ అవార్డులు



అవార్డులను కలెక్టర్‌కు అందిస్తున్న జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ విజయభారతి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, మత్స్యశాఖ అభివృద్ధికిగాను జిల్లాలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు జాతీయ స్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి. ఇండో అగ్రి, సస్టైనబిలిటీ మ్యాటర్స్ సంస్థల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన సస్టైనబుల్ అగ్రికల్చర్ సమ్మిట్‌లో ఈనెల 7న అధికారులు ఈ అవార్డులు అందుకున్నారు. రైతు సంక్షేమం కోసం సుస్థిర వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఈ అవార్డు దక్కింది. మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి జిల్లాలో అవలంబిస్తున్న వివిధ పద్ధతులకుగాను జిల్లా మత్స్య శాఖకు మరో అవార్డు లభించింది. వ్యవసాయ శాఖకు వచ్చిన అవార్డును జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ నీలం వెంకటేశ్వర్‌రావు, మత్స్యశాఖకు వచ్చిన అవార్డును జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ విజయభారతి న్యూఢిల్లీలో కలెక్టర్ తరపున అందుకున్నారు.

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం

సానుకూలంగా ఉన్న కేంద్ర విమానయాన శాఖ మంత్రి

- స్థల పరిశీలనకు అంగీకరించడంతో ఆశలు
- ఏర్పాటు చేస్తే ఉమ్మడి జిల్లా ప్రజలకు ఉపయోగకరం

(కరీంనగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వేగంగా అభివృద్ధి చెందుతున్న కరీంనగర్ జిల్లా కేంద్రం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటు మరోసారి తెరపైకి వచ్చింది. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో బసంత్‌నగర్ సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఏర్పాటు చేసుకున్న రన్‌వే స్థలంలో మినీ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన వచ్చింది. పారిశ్రామిక కేంద్రమైన రామగుండం, గోదావరిఖనితో పాటు బొగ్గు గనులు ఉన్న మంచిర్యాల, బెల్లంపల్లి ప్రాంతాలకు కరీంనగర్‌కు సమదూరంలో ఉండే ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని అప్పుడు అందరూ అభిప్రాయపడ్డారు. కేంద్ర విమానయాన శాఖ సానుకూలంగా స్పందించి అందుకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. అక్కడ స్థలం తక్కువగా ఉడడంతో పాటు, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడంతో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అను కూలంగా లేదని తేల్చారు. ఆ తర్వాత గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్‌ల ప్రతిపాదనలు వచ్చిన సమయంలో వరంగల్ జిల్లా మామునూరు వద్ద దీనిని నిర్మించాలని భావించి అందుకు అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం కరీంనగర్ ఎయిర్‌పోర్ట్ అంశం తెరపైకి వచ్చింది.

- కేంద్ర మంత్రిని కలిసిన సుడా చైర్మన్

రెండు రోజుల క్రితం ఢిల్లీలో కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, వరంగల్ కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఇనుగాల వెంకటరాంరెడ్డి కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజారపు రాంమోహన్‌నాయుడును కలిశారు. కరీంనగర్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు, ఇప్పటికే అనుమతించిన మామునూరు ఎయిర్‌పోర్ట్ గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి రాంమోహన్‌నాయుడు మామునూరు ప్రాంత పరిశీలనకు వచ్చిన సందర్భంలో కరీంనగర్‌లోనూ స్థల పరిశీలన జరిపించి ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాల గురించి అధ్యయనం చేయిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కరీంనగర్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపై ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

- పలు అనుకూలతలు

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో వరంగల్ తర్వాత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాగా కరీంనగర్, అంతే వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా కరీంనగర్ కార్పొరేషన్ నిలుస్తున్నాయి. కరీంనగర్ కార్పొరేషన్‌ను కేంద్రం ఇప్పటికే స్మార్ట్ సిటీగా

(మిగతా 8వపేజీలో)

- అందుబాటులో 432 ఎకరాల భూమి

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయడానికి ప్రత్యేకంగా స్థల సేకరణ ఏది చేయాల్సిన అవసరం లేకుండానే 432 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. నేదునూరు విద్యుత్ కేంద్రం ఏర్పాటు కోసం సేకరించిన భూమి ఇప్పుడు ఆ ప్రతిపాదన విరమించుకోవడంతో ఖాళీగా ఉంది. రాజీవ్ రహదారికి సమీపంలో ఉంది. ఈ స్థలమే కాకుండా చొప్పదండి ప్రాంతంలో కూడా 200 ఎకరాల పైచిలుకు ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నది. ఈ రెండు ప్రాంతాల్లో ఎదో ఒక చోట కరీంనగర్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేస్తే జిల్లా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నది. దీంతో స్థల సేకరణ ఇబ్బందులు కూడా ఉండవు. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్‌నాయుడు ఈ ఎయిర్ పోర్ట్ ఏర్పాటు అంశంపై సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీంనగర్, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఈ విషయంలో చొరవ చూపి ఇక్కడ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు అయ్యే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.





యజ్ఞవరాహక్షేత్రంలో విశేషాలంకరణలో లక్ష్మీ అమ్మవారు

- వైభవంగా వరలక్ష్మీ వ్రతాలు - పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు భక్తిశ్రద్ధలతో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తుల దైవ సందర్శనతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి. వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు, అమ్మవారి నామస్మరణలు, దీపకాంతులతో ప్రతీ గృహం కళకళలాడింది. మహిళలు, యువతులను ఇంటికి ఆహ్వానించి మహాలక్ష్మి స్వరూపంగా భావిస్తూ పరసర్పం పసుపు కుంకుమలు, పప్పు బెల్లాలు, ఫలతాంబూలాలు, వాయినాలుగా ఇచ్చుకుని ఆశీస్సులు పొందారు. ఆలయాల్లో అర్చనలు జరిపి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చైతన్యపురి మహాశక్తి ఆలయం మహిళలతో పోటెత్తింది. ఉదయం మహాహారతి, సాయంత్రం వరలక్ష్మీ వ్రతం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో కేంద్ర హోంశాఖా సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. యజ్ఞవరాహక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారికి అభిషేకం, పూలంగిసేవ, వరాహస్వామి మూలమంత్ర హవనం, మహాభిషేకం, వరలక్ష్మి వ్రతం జరిగింది. సాయంత్రం సహస్రనామార్చన, ఊంజల్‌సేవ, కుంకుమార్చనలు జరిగాయి. జ్యోతినగర్ హనుమాన్ సంతోషిమాత ఆలయంలో ఒడిబియ్యం, గాజులు, పసుపుకుంకుమలు, చీరలు సమర్పించారు. వావిలాలపల్లి శ్రీహనుమత్ సహిత కనక దుర్గ ఆలయంలో శ్రీచక్రార్చన, కుంకుమార్చన జరిగింది. భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో కుంకుమార్చనలు జరిగాయి. అశోక్‌నగర్ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. కమాన్ రోడ్ రామేశ్వరాలయంలో కుంకుమార్చనలు, పర్వతవర్ధినీ అమ్మవారికి విశేషాలంకారం చేశారు.



కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు హారతి ఇస్తున్న అర్చకుడు



మహాశక్తి ఆలయంలో వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

నేడు రాఖీ పౌర్ణమి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సృష్టిలో రక్త సంబంధాన్ని మించిన అనుబంధం లేదు. అమ్మా నాన్నల అనురాగ వంతెనగా, అన్నాచెల్లెళ్ల అనురాగ పుష్పం నుంచి గుబాళించే పరిమళం రక్షాబంధన్. శ్రావణ మాసంలో వచ్చే ఆడపడచుల ప్రత్యేక ఈ పండుగను శనివారం జరుపుకోనున్నారు. అన్నాదమ్ములకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి క్షేమాన్ని ఆశిస్తూ జరుపుకునే శుభదినం. ఇదే రోజున యజ్ఞోపవీతాలు మార్చుకోవడంతో దీన్ని జంధ్యాల పున్నమి అంటారు. రక్ష అంటే పవిత్ర కంకణం. పూజల ప్రారంభంలో పురుషులు కుడి చేతికి, స్త్రీలు ఎడమ చేతికి రక్ష కట్టుకుంటారు. క్షేమం కలిగించే ఈ కంకణంతో కార్యక్రమం నిర్విఘ్నంగా సాగాలని కోరుతారు. రక్ష వల్ల సంవత్సరమంతా సకల శుభాలు కలుగుతాయని విశ్వాసం.



- పురాణ గాథలు...

రాఖీ వెనుక పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. గణపతి, శ్రీకృష్ణుడు, శ్రీమహావిష్ణువు, ఇంద్రుడు, యమధర్మరాజు వంటి దేవతలతో రాఖీ పౌర్ణమి కథలు ముడిపడి ఉన్నాయి. క్రీస్తు పూర్వం 326లో గ్రీకు వీరుడైన అలెగ్జాండర్ నుంచి 16వ శతాబ్దికి చెందిన మొఘల్ చక్రవర్తి హుమాయూన్ వరకు పలువురు రక్షా దీక్షల్లో భాగస్వాములైనారు.

- రాఖీలకు భలే గిరాకీ..

మార్కెట్‌లో రాఖీల కొనుగోళ్ల సందడి నెలకొన్నది. కాలానుగుణమైన రంగుల రాఖీలు మార్కెట్‌ను ముంచెత్తున్నాయి. అందరినీ ఆకర్షించే విభిన్న రాఖీలు, వెండి, బంగారు రాఖీలు అబ్బురపరుస్తున్నాయి. వెండి పూతపూసిన రాఖీలూ మంచి ధర పలుకుతున్నాయి. సీజన్ దుకాణాలతో పాటు రోడ్లపై బండ్లను నిలిపి రాఖీలను అమ్ముతున్నారు. ముత్యాలు, చెమ్కీలు, పూసలు, రూబీలు, జరీ పొదిగిన మెరుపుల రాఖీలు మురిపిస్తున్నాయి. స్వస్తిక్, ఓంకారం, చోటాభీమ్, కృష్ణుడు, గణేశుడు, జాతీయ చిహ్నాలు, దేవతలు, స్పైడర్‌మన్ వంటి ఆకృతుల్లో ఉన్న రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. టవర్‌సర్కిల్, పాతబజార్‌రోడ్, మంకమ్మతోట, రాంనగర్, జగిత్యాల రోడ్, కమాన్, తదితర ప్రాంతాల్లో అమ్మకాలు విస్తృతంగా సాగుతున్నాయి. అన్ని సైజుల్లో, వివిధ రంగుల్లో ఉన్న రాఖీలను కొనేందుకు అందరూ ఆసక్తి కనబరుస్తున్నారు.



రాఖీలు కొనుగోలు చేస్తున్న యువతులు

బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై బీజేపీ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నది సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల రాష్ట్రానికే నష్ట వాటిల్లుతుందని, ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడానికి సీపీఐ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో బీసీ బిల్లుకు మద్దతు తెలిపి కేంద్రంలో బిల్లును అడ్డుకోవడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రిజర్వేషన్ల సమస్యను సాధ్యమైనంత తొందరగా ఓ కొలిక్కి తీసుకువచ్చి రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని ఎల్ఎండీ ఆనకట్ట వద్ద ముప్పై సంవత్సరాలుగా నివాసముంటున్న పేదల ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయంటూ ఖాళీ చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడాన్ని తప్పు బట్టారు. ఇళ్లను కూల్చే ఆలోచనను ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు.తక్షణమే నోటీసులను వెనక్కి తీసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, ఎఐ ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, బండ రాజిరెడ్డి, బ్రామండ్లపల్లి యుగేందర్, మచ్చ రమేష్ పాల్గొన్నారు.

ఉపాధిహామీలో ఈకేవైసీ విధానం

- అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
- ఈ నెల 15 నుంచి అమలు

6

కాళ్ల పారాణి ఆరకముందే కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి
- పీజీ ఎంట్రన్స్ పరీక్షరాసి వెళుతుండగా ఘటన

6

పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేయాలి

కరీంనగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరంలోని కరీంనగర్-సిరిసిల్ల బైపాస్ రోడ్‌లోని బృహత్ పట్టణ ప్రకృతి వనాన్ని అభివృద్ధి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ వనాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వనాన్ని మరింత అభివృద్ధి చేయాలని, ఇక్కడ ఉన్న నీటి కొలనులను అభివృద్ధి చేసి కలువ మొక్కలతోపాటు రకరకాల పూల మొక్కలు పెంచాలని సూచించారు. కొత్తగా నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని, ఖాళీ స్థలంలో మరిన్ని మొక్కలు నాటాలని అన్నారు. పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శకులకు అనుకూలంగా తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొన్నారు.

- అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం

మానకొండూర్: అంగన్‌వాడీల్లో పిల్లలకు పౌష్టికాహారం అందుతుందని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండలంలోని అన్నారంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ సభలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గ్రామంలో 12 వందల కుటుంబాలుండగా నాలుగువేల జనాభా ఉందన్నారు. గర్భిణులు, బాలింతలు ఎక్కువగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 80 మంది పిల్లలు నమోదు చేసుకున్నప్పటికి 39 మంది పిల్లలు ప్రైవేటు పాఠశాలలకు వెళుతున్నట్లు రికార్డులు చెప్పుతున్నాయన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం లభిస్తుందన్నారు. గర్భిణులు, మహిళలు, పిల్లలకు అంగన్‌వాడీల ద్వారా అన్ని రకాల పోషకాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, ఐసీడీఎస్ జిల్లా అధికారి సరస్వతి, ఎంపీడీవో వరలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యులు సల్మాన్, రాజునాయక్ పాల్గొన్నారు.



బృహత్ పట్టణ ప్రకృతి వనాన్ని సందర్శించిన కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

గణేశ్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి విమర్శించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), బీహార్‌లో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ను వ్యతిరేకిస్తూ తెలంగాణ చౌక్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ 'సర్' ఏకపక్షంగా ఉందని, వయోజన ఓటు హక్కు సార్వత్రిక హక్కును ఉల్లంఘిస్తుందన్నారు. గుర్తింపు ప్రక్రియ రుజువు భారాన్ని వ్యక్తిగత పౌరులపై మోపడం సరికాదన్నారు. పౌరసత్వానికి సంబంధించిన దరఖాస్తులు, డాక్యుమెంటరీ ఆధారాలు అవసరం అవుతాయని, పేదవారు వాటిని ఎక్కడి నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. ఆధార్, రేషన్ కార్డులు వంటి సూచికలను మినహాయించి తల్లిదండ్రుల గుర్తింపును తప్పనిసరి చేయడం అవివేకం అన్నారు. తక్కువ సమయం, ముందస్తు సంప్రదింపులు లేకుండా హడావుడిగా నెల రోజుల్లో రివిజన్ ఎలా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. బీహార్ రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ విడుదల చేసిన ముసాయిదాలో 64 లక్షల ఓట్లు తొలగించారని, ముఖ్యంగా మైనార్టీలు, మహిళల ఓట్లు తొలగించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ వచ్చిన ఎన్నికల కమిషన్ ఇప్పుడు ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ప్రజాస్వామ్య విరుద్ధమైన ఈ ప్రక్రియకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాస్వామ్యవాదులుప్రగతిశీల శక్తులు, ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుందరెడ్డి, గుడికందుల సత్యం, జి భీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, నాయకులు శనిగరపు రజనీకాంత్, తిప్పారపు సురేష్, జి తిరుపతినాయక్, గజ్జల శ్రీకాంత్, శివరాజ్, కనకరాజు, సాగర్, అరవింద్, వినయ్ సాగర్, సందేశ్, కండె రాజు, లక్కి పాల్గొన్నారు.

పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక..
యువతి బలవన్మరణం


సంధ్య మృతదేహం

చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పెద్దలు కుదిర్చిన పెళ్లి ఇష్టం లేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. చొప్పదండి పట్టణానికి చెందిన వనపర్తి సంధ్య(27) కరీంనగర్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తోంది. వారం క్రితం కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన యువకుడితో పెళ్లి నిశ్చయమైంది. ఈనెల 14న వివాహం జరగాల్సి ఉంది. వివాహం కోసం అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పెళ్లిపనుల్లో భాగంగా యువతి తల్లి దండ్రులు పెళ్లి కార్డులను పంచేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో సంధ్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కార్డులు పంపిణీ చేసి శుక్రవారం మధ్యాహ్నం తల్లిదండ్రులు వచ్చి చూసేసరికి సంధ్య మృతిచెంది ఉంది. తండ్రి కనుకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ రెడ్డి తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం శ్రీరాములపల్లె రోడ్డు కట్ట వద్ద ఉడుత తిరుపతి(45) పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన తిరుపతి ప్రతి రోజు మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 7వ తేదిన ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మరుసటి రోజు ఉదయం శ్రీరాములపల్లె రోడ్ కట్టవద్ద తిరుపతి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. పోలీస్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి కుమార్తె రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పొలంలో వరి నారు గుంజుతూ కూలీ మృతి

సైదాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనపూర్ గ్రామానికి చెందిన గుంటి అనిల్(35) అనే కూలీ వరి నారు గుంజుతూ పొలంలోనే పడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అనిల్ అదే గ్రామానికి చెందిన గుర్రాల మల్లారెడ్డి అనే రైతు వ్యవసాయ పొలంలో నారు గుంజేందుకు వెళ్లాడు. నారు గుంజుతూ అకస్మాత్తుగా పొలంలో పడి పోయాడు. నాటు వేసేవారు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. దీంతో వెంటనేవారు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరు మున్నీరయ్యారు. తనకుమారుడి మరణంపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తల్లి లచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగాధరకు చెందిన రాజుల యాదయ్య(50) దుర్మరణం చెందగా, గంగాధర వేణు తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. యాదయ్య, వేణు ద్విచక్రవాహనంపై కరీంనగర్ కేడీసీసీ బ్యాంక్‌కు వచ్చి తిరిగి గంగాధరకు బయల్దేరారు. కొత్తపల్లి శివారులో ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా బైక్‌ను ఢీకొని మరో కారును ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనంపై వెనుకకూర్చున్న యాదయ్య రెండువాహనాల మధ్య ఇరుక్కుని తీవ్రగాయాలతో అక్కడికక్కడే మరణించాడు. వేణుకు గాయాలయ్యాయి. యాదయ్య మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి, గాయపడిన వేణును అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైసాంబమూర్తి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. యాదయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

● రోడ్డు ప్రమాదానికి గురైన క్షతగాత్రుడిని మైత్రీ గ్రూప్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో స్వయంగా ట్రాఫిక్ క్లియర్ చేశారు.

కాళ్ల పారాణి ఆరక ముందే కానరాని లోకాలకు..



ఈ చిత్రంలో చిరునవ్వులు చిందిస్తోన్న వధువు పేరు ముద్దసాని అఖిల.. చొప్పదండి మండలం రుక్మాపూర్‌కు చెందిన ఆమె వివాహం ఈ నెల 6న జగిత్యాల జిల్లా లొత్తునూరుకు చెందిన రాజుతో జరిగింది. కోటి ఆశలతో వివాహ బంధంలోకి వెళ్లిన ఆమెను మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. పీజీ ఎంట్రెన్స్ రాసి భర్తతో కలిసి తిరిగి వస్తుండగా వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఓ లారీ వెనక నుంచి ఢీకొంది. రోడ్డుపై పడ్డ అఖిలను ఆ లారీ తొక్కుకుంటూ వెళ్లడంతో ఆమె తల నుజ్జునుజ్జయి సంఘటన స్థలంలోనే మృతి చెందింది. రాజు కాస్త పక్కకు పడడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

● రోడ్డు ప్రమాదంలో నవ వధువు మృతి
● భర్తకు గాయాలు
● పీజీ ఎంట్రెన్స్ పరీక్షరాసి వెళుతుండగా ఘటన


అఖిల (ఫైల్)

తిమ్మాపూర్/చొప్పదండి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నవ వధువు.. కాళ్ల పారాణి ఆరకముందే కానరాని లోకాలకు వెళ్లి పోయింది. 22ఏళ్లకే నిండు నూరేళ్లు నిండాయి. పెళ్లైన రెండు రోజులు కూడా గడవక ముందే ఆమె రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించింది. ఈ సంఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని లత-నర్సయ్య దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె ముద్దసాని అఖిల (22) వివాహాన్ని ఈ నెల 6న వెల్గటూరు మండలం లొత్తునూర్ గ్రామానికి చెందిన రాజుతో ఘనంగా జరిపించారు. అదే రోజు నూతన వధూవరులు లొత్తునూర్‌కు వెళ్లారు. తిరిగి శుక్రవారం ఉదయం రుక్మాపూర్‌కు వచ్చారు. అఖిలకు పీజీసెట్ ప్రవేశపరీక్ష కోసం ద్విచక్ర వాహనంపై తిమ్మాపూర్ వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న నవదంపతులు రాజు, అఖిల కింద పడిపోయారు. లారీ వేగంగా అఖిల తలపై నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త రాజు స్వల్పగాయాలతో బయట పడ్డాడు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది ప్రమాదానికి కారణ మైన లారీని పట్టుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసు కున్నారు. మృతురాలు అఖిల తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


అఖిల మృతదేహం

వచ్చాక నల్లపూసలు గుచ్చుకుంటానని చెప్పి వెళ్లి..

పరీక్ష పూర్తయిన వెంటనే రుక్మాపూర్‌కు వచ్చి పెళ్లితంతు కార్యక్రమంలో (నల్లపూసలు గుచ్చుకోవడం) పాల్గొంటామని చెప్పి ఇద్దరూ వెళ్లారు. కూతురు కోసం ఎదురు చూస్తున్న తల్లిదండ్రులకు మరణవార్త వినిపించడంతో కుప్పకూలిపోయారు. ఎంతో సంతోషంగా కూతురు అల్లున్ని చూసి మురిసిపోయిన వారి కుటుంబంలో ఒక్కసారిగా విషాదచాయలు అలుముకున్నాయి. కూతురు వివాహాన్ని ఘనంగా జరిపించామన్న సంతోషం ఆ కుటుంబంలో ఒక్కరోజు కూడా నిల్వలేదు. పెళ్లి తంతు కార్యక్రమం అనంతరం తమ్ముడికి రాఖీ కడతానని చెప్పి వెళ్లిన అఖిల తిరిగి రానిలోకాలకు వెళ్లడంతో తమ్ముడు తల్లడిల్లిపోయాడు. అఖిల మృతి రుక్మాపూర్‌తో పాటు లొత్తునూర్‌లో విషాదం నింపింది.

నిందితుడిని అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ రాష్ట్రంలో కిడ్నాప్ కేసుకు సంబంధించి నిందితుడిని కొత్తపల్లి శివారులో రాజస్థాన్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కోసం రాజస్థాన్ పోలీసులు వెతుకుతున్నారు. నిందితుడు హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తుండగా మార్గమధ్యలో కొత్తపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కొత్తపల్లి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం నిందితుడిని రాజస్థాన్‌కు తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాక గ్రామంలోని మానేరువాగు నుంచి అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీస్‌లు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొండపాక గ్రామానికి చెందిన నాగుల రాజు, అవాల గిరిబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వారినుంచి రూ.16.500నగదు, 7బైక్‌లు, 8సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కార్లు కిరాయికి పెడతానంటూ నమ్మించి మోసం

● మరొకరి దగ్గర కుదువ పెట్టి లక్షల్లో అప్పు ● నిందితుడి అరెస్టు, నాలుగు కార్లు, సెల్‌ఫోన్ సీజ్


స్వాధీనం చేసుకున్న కార్లు, నిందితుడితో ఏసీపీ రమేష్, అధికారులు

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దళిత బంధు లబ్ధిదారులు, ఇతర కారు యజమానుల వద్ద తాను కార్లు అద్దెకు పెట్టించి నెలానెలా కిరాయి ఇప్పిస్తానంటూ నమ్మించి యజమానులకు తెలియకుండా కార్లు కుదువ పెట్టుకున్న గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన మారుపెల్లి ప్రణయ్ భాస్కర్(29) అనేవ్యక్తిని శుక్రవారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. స్థానిక వన్‌టౌన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. గోదావరిఖని ఎల్‌బీనగర్‌కు చెందిన బోడ తిరుపతి, శ్రీనగర్‌కాలనీకి చెందిన కాసర్ల మేఘమాల, ఇల్లంతకుంట మండలం వంతడుపులకు చెందిన సప్పి కుమార్, సప్పి మొగిలిల నుంచి తాను కార్లు అద్దెకు పెట్టిస్తానంటూ మారుపెల్లి ప్రణయ్ భాస్కర్ అనే కారు డ్రైవర్ కొన్ని నెలల క్రితం కార్లను తీసుకెళ్లాడు. ఈ కార్లను హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ ప్రాంతాల్లో అద్దెకు పెట్టానంటూ నమ్మించాడు. ఒకటి రెండు నెలలు అద్దె కూడా ఇచ్చాడు. జల్సాలకు అలవాటు పడిన ప్రణయ్ భాస్కర్ ఈ కార్లను కొందరి వద్ద తనఖా పెట్టి కారుకు రెండు మూడు లక్షల చొప్పున రూ.10లక్షల వరకు అప్పు తీసుకున్నాడు. యజమానులు ఫోన్ చేస్తే స్పందించకుండా హైదరాబాద్‌కు పరారై తప్పించుకుని తిరుగుతున్నాడు. అతనికి సోదరి జూపాక పుష్పలత, సప్తగిరి కాలనీకి చెందిన వనం శ్రీనివాస్ సహకరించారు. బాధితుడు బోడ తిరుపతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు సీఐ ఇంద్రసేనారెడ్డి కేసు నమోదు చేసుకుని నాలుగు కార్లు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఎవరైనా వాహనాలను తనఖా పెట్టుకునే ముందు పూర్తివివరాలను తెలుసుకోవాలన్నారు. ఇలాంటి వాహనాలు తనఖా పెట్టుకుంటే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రణయ్ భాస్కర్ బాధితులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. నిందితున్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ ఇంద్రసేనారెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్, సదానందం, ఏలియా, కానిస్టేబుల్ మధుకర్, రమేష్‌లను ఏసీపీ అభినందించారు.

సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టిన ఇద్దరిపై కేసు

ఇల్లంతకుంట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామానికి చెందిన ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సావనపెల్లి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోషల్‌మీడియాలో మీడియాలో పోస్టులు పెట్టిన ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం ఇల్లంతకుంటకు చెందిన సాదుల్ తనని అవమానించే విధంగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడని, అదే విధంగా నర్సక్కపేట గ్రామానికి చెందిన కొత్త రాజు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మీద అసభ్యకరంగా మార్ఫింగ్ వీడియోలు పెట్టాడని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. సోషల్‌మీడియాలో అభ్యంతరకరంగా పోస్టులు ఎవరు పెట్టవద్దన్నారు. ఇతరుల మనోభావాలు కించపర్చేలా వ్యవహరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

పాఠశాలలో గ్యాస్ సిలిండర్ చోరీ

మల్లాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామంలోని ప్రాథమికపాఠశాల వంట గది తాళం పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు గ్యాస్ సిలిండర్‌ను అపహరించుకెళ్లినట్లు బాధిత ఆయా మహ్మద్‌రజియా శుక్రవారం వాపోయింది. మధ్యాహ్నభోజనం అనంతరం గురువారం వంటగదికి తాళంవేసి శుక్ర వారం వచ్చిచూడగా సిలిండర్ లేదన్నారు. మొగిలిపేట గ్రామంలో ఇటీవల వరుసగా సిలిండర్ల చోరీకి గురవుతున్నాయని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన్‌గ్రామస్థులు కోరుతున్నారు.

ఫేక్ ఫేస్ రికగ్నిషన్ వ్యవహారంలో.. మరో నలుగురు కార్యదర్శులపై వేటు

జగిత్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఫేక్ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులపై వేటుపడింది. శుక్రవారం జిల్లాలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ, ఒక పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఫేక్‌ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ వ్యవహారంలో సంబంధితయాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటోను అప్‌లోడ్ చేసిన బుగ్గారం మండలం చందాయపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్, ఇరవై మంది కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన విషయం విదితమే. జూలైలో 24పని దినాలకు గాను 20పనిదినాల వరకు ఫేక్ ఫేస్‌రికగ్నిషన్ అటెండెన్స్‌కు పాల్పడిన నలుగురు కార్యదర్శులపై అధికారులు వేటు వేశారు. బుగ్గారంమండలం గోపులాపూర్‌లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బీర్‌పూర్‌మండలం రేకులపల్లి, మల్యాల మండలం రాజారం, ధర్మపురి మండలం నాగారంపంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరితోపాటు మరో17మంది పంచాయతీ కార్యాదర్శులకు వేతనాల్లో కోతవిధిస్తూ ఉత్తర్వులుజారీ అయ్యాయి. కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీచేసినట్లు జిల్లా పంచాయతీఅధికారి మదన్‌మోహన్ తెలిపారు.

జోరుగా మట్టి దందా

● ప్రభుత్వ భూములే లక్ష్యం
● అడ్డుకున్న గ్రామస్థులు


మట్టి టిప్పర్లను అడ్డుకుంటున్న గ్రామస్థులు

జూలపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమరవాణా జోరుగా సాగుతోంది. మట్టి మాఫియాకు రాజకీయ పలుకుబడి తోడవడంతో అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. మండలంలోని చీమలపేట గ్రామశివారులోని దామెరచెరువుకు అతి సమీపంలో గల గుట్టబోరు మట్టిని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వుతూ టిప్పర్ల ద్వారా నాలుగురోజులుగా మట్టిని ఇతర మండలాలకు తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులు గురువారం మట్టి టిప్పర్లను అడ్డుకున్నారు. మట్టిని తరలిస్తున్న విషయమై మైనింగ్ అధికారులకు శుక్రవారం చేశారు. దీనిపై అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుట్టబోరు మట్టిని తొలగించడం వల్లా దామెర చెరువులో నీరు నిలువక ఎడారిగా మారే ప్రమాదం ఉందని గ్రామస్థులు మండిపడుతున్నారు. అంతే కాకుండా కొందరు మట్టిమాఫియా కేటుగాళ్ల గ్రామంలోని విలువైన ప్రభుత్వ భూముల్లో చెట్లను నరికి వేయడమే కాకుండా చెట్లకర్రలను, మట్టిని అమ్ముకుని సొమ్ముచేసుకుంటున్నారని చెపుతున్నారు. మట్టిని తొలగించిన భూమిని సాగుకు వాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

ఈ విషయమై జిల్లామైనింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా దామెరచెరువు పక్కన మట్టిని తొలగించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. రోడ్డునిర్మాణాలకు మట్టి తరలిస్తే ఆపనుల నుంచి ప్రభుత్వానికి సొమ్ము జమచేయబడుతుందని పేర్కొన్నారు. అక్కడి ప్రదేశాన్ని పరిశీలించి తదుపరిచర్యలు తీసుకుంటామన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్


నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంతోపాటు రూరల్ మండలంలో కొన్ని రోజులుగా ఇళ్లముందు నిలిపిఉన్న ద్విచక్ర వాహనాలను ఎత్తుకెళ్తున్న పడాల దినేష్ అనే నిందితుడిని జగిత్యాలపట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టుచేశారు. టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. పట్టణపోలీసులు శుక్రవారం ఎస్‌కేఎన్ఆర్ కళాశాల సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన పడాల దినేష్ ద్విచక్రవాహనంపై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. విచారణలో ద్విచక్రవాహనాల దొంగగా గుర్తించామన్నారు. దినేష్‌పై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితుడి వద్ద 9 వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సైలు సుప్రియ, రవి కిరణ్, కుమారస్వామి ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కొరడా

● ఇసుక డంప్‌ల సీజ్
● జల్లెడ పడుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు
● 'ఆంధ్రజ్యోతి' కథనంపై స్పందన

కోల్‌సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై కలెక్టర్ కోయ శ్రీహర్ష కొరడా ఝుళిపించారు. ఇసుక మాఫియా శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై స్పందించిన కలెక్టర్ రెవెన్యూ, పోలీస్, మైనింగ్ విభాగాల అధికారులతో తనిఖీ చేయించారు. వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఇసుక నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. రామగుండం అర్బన్ పరిధిలోని పాములపేట, మేడిపల్లి ఇసుక రీచ్‌లను మూసివేశారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే రామగుండం మండల పరిధిలోని ఎఫ్‌సీఐ, సంజయ్‌గాంధీనగర్, గోదావరిఖని సప్తగిరికాలనీ, జనగామలో ఇసుకరీచ్‌లను సీజ్‌చేశారు. 190ట్రాక్టర్ ట్రిప్పులను స్వాధీనం చేసుకున్నారు. సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన బెంద్రం రాజిరెడ్డి, సప్తగిరికాలనీకి చెందిన గుంపుల ఓదెలు, మరికొంత మందిపై 303/2బీఎన్ఎస్, 21ఎంఎండీఏఆర్‌ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు పేర్కొంటున్నారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు రామగుండం అర్బన్ పరిధిలోని ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు విస్తృత తనిఖీలు జరిపారు. ఏసీపీ రమేష్ సారథ్యం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐలు రమేష్, భూమేష్, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు, ఎన్‌టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్‌లు తనిఖీల్లో పాల్గొన్నారు. ఎన్‌టీపీసీ, గోదావరిఖని, జనగామ ప్రాంతాల్లో పలు ఇసుక డంప్‌లను సీజ్ చేశారు. మూసివేసిన పాములపేట, మేడిపల్లి క్వారీలకు ట్రాక్టర్లు వెళ్లకుండా రెవెన్యూ అధికారులు కందకాలు తీశారు. శుక్రవారం ఎన్‌టీపీసీ పీటీఎస్ సమీపంలోని ఇసుక డంప్‌ను సీజ్‌చేశామని, అలాగే జనగామలో మరో డంప్‌ను సీజ్ చేసినట్టు తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్ పేర్కొన్నారు. రామగుండం మండల పరిధిలోని ఇసుక రీచ్‌లను నిషేధించామని, ఇక నుంచి ఎవరైనా గోదావరినదిలోకి ట్రాక్టర్లను దించి ఇసుకను తీసుకువచ్చినా, డంప్ చేసినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వృద్ధురాలిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

● దూషించినందుకే తలపై మోది హత్య

కొడిమ్యాల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన మెన్నేని ప్రేమలత అనే వృద్ధురాలి హత్య కేసులో నిందితుడైన నాచుపల్లి గ్రామానికి చెందిన సురభి రఘునందన్‌రావును శుక్రవారం అరెస్టుచేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ప్రేమలత రఘునందన్‌రావుకు వరుసకు అత్తమ్మ అవుతుంది. నిందితుడు కనిపించినప్పుడల్లా ప్రేమలత బూతులుతిట్టేది. దీంతో ఆమెపై రఘునందన్‌రావు కోపం పెంచుకున్నాడు. గతసంవత్సరం ప్రేమలతకు, నిందితుడికి మధ్య గొడవ జరగ్గా పెద్దమనుషులు పంచాయితీ నిర్వహించి సర్దిచెప్పారు. బుధవారం రాత్రి వృద్ధురాలు ఊరినుంచి ఇంటికివెళ్తుండగా రఘునందన్ రావును చూసి దూషించింది. దీంతో ప్రేమలతను అక్కడే ఉన్న కర్రతో తలపై కొట్టి బండరాయితో బాదడంతో ఆమె మృతి చెందింది. అనంతరం మృతురాలి ఇంటి ముందు ఉన్న నీరు లేని బావిలో పడవేశాడు. నిందితుడికోసం గాలించి శుక్రవారం ఉదయం దొంగలమర్రి సమీపంలోపట్టుకొని అరెస్టు చేశామన్నారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల, ఎస్సై సందీప్ ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రఘుచందర్

ఉపాధిహామీలో ఈకేవైసీ విధానం

● అక్రమాల అడ్డుకట్టకు చర్యలు
● ఈ నెల 15 నుంచి అమలు


ముఖచిత్రం ద్వారా హాజరు తీసుకుంటున్న సిబ్బంది

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఈకేవైసీ విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. దీంతో నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో నకిలీ ఫొటోల అప్‌లోడ్‌కు అడ్డుకట్ట పడనుంది. ఉపాధిహామీ పనుల కోసం వచ్చిన కూలీలను ఫీల్డ్ అసిస్టెంట్‌లు రెండు సార్లు ఫొటోలు తీయాల్సి ఉంటుంది. ముందుగా పనులకు వచ్చిన వెంటనే ఒకసారి, నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటో తీస్తారు. ఈ రెండు ఫొటోల్లో కూలీలు ఒకేలా ఉంటేనే వేతనాలు మంజూరవుతాయి. తేడా ఉంటే వేతనాలు నిలిపివేస్తారు. ఆగస్టు 15 నుంచి ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టనుండగా ఇప్పటికే క్షేత్ర సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు.

ప్రస్తుతం ఉపాధిహామీ కూలీ పనుల్లో ఒకరికి బదులు మరొకరు వెళ్లి వేతనాలు పొందినట్లు అనేక సామాజిక తనిఖీల్లో బయటపడింది. కొన్ని సందర్భాల్లో నిధులను రికవరీ కూడా చేశారు. మరికొన్ని గ్రామాల్లో ప్రజా ప్రతినిధుల బంధువులు, క్షేత్ర సహాయకుల కుటుంబ సభ్యులు ఉపాధి హామీ పనులకు వెళ్లినట్లు హాజరు నమోదు చేస్తున్నారు. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త యాప్ (ఎన్ఎంఎంఎస్)ను తీసుకొచ్చింది. ఈ యాప్‌ను కూడా కొందరు దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కొత్త విధానానికి చర్యలు చేపట్టారు. గతంలోకూలీలు పని చేయకున్నా క్షేత్ర సహాయకులు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు అధికారుల దృష్టికి వచ్చింది. దీన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఈకేవైసీ విధానాన్ని అమల్లోకి తీసుకొస్తోంది. ఈ విధానంతో నకిలీ హాజరు అవకాశం ఉండకపోగా వేతనాల చెల్లింపులోనూ పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంది.

ఇసుక అక్రమ రవాణాపై కేసు నమోదు

మంథనిరూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నాల గ్రామ శివారులోని మల్లయ్య ఇటుక బట్టీలో అక్రమంగా నిల్వచేసిన ఇసుకను తరలించడానికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రమేష్ శుక్రవారం తెలిపారు. గోదావరినది నుంచి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇటుకల బట్టీకి తరలించి అక్కడినుంచి జేసీబీ సహాయంతో రెండు టిప్పర్లలో ఇసుకను జగిత్యాలకు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గురువారం రాత్రి పట్టుకున్నట్లు తెలిపారు. జేసీబీ, టిప్పర్లను, ఇసుక డంప్ సీజ్‌చేసి వాసం సతీష్, ముస్కీ రాజుకుమార్, ఎర్రం సంతోష్, తనుగుల మహేష్, తన్నీరు మల్లిఖార్జున్, పొట్ల రాజ్‌కుమార్, పొయ్యల భాస్కర్, పిక్కల మల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో వృక్ష రక్షా బంధన్



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ధన్గర్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం వినూత్నంగా చేపట్టిన వృక్ష రక్షా బంధన్‌కు విద్యార్థినుల నుంచి స్పందన లభించింది. వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హెచ్‌ఎంగా పని చేసిన ప్రమోద ఆలోచనలతో 16 సంవత్స రాలుగా కార్యక్రమం కొనసాగుతోంది. నీతూకుమారి కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో ఆమె ఈ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమోద మాట్లాడుతూ వృక్షాన్ని అన్నదమ్ములుగా భావించి రాఖీ కట్టి రక్షిస్తే నీడను, ఆక్సిజన్, ఆహారాన్ని అందిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. పర్యావరణాన్ని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు.

చెట్లకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి ఆలయం శుక్రవారం భక్తుల రద్దీతో సందడిగా మారింది. భక్తులు ప్రవిత్ర స్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, కోడె మొక్కు, శీఘ్ర దర్శనం, బ్రేక్‌దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్న భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఉద్యోగులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.



బాంబ్ స్క్వాడ్ తనిఖీలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయంలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు..

వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొనడంతో బాంబ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ప్రాంగణంలో, ఆవరణతో పాటు పలు విభా గాల్లో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మహాలక్ష్మి దేవాలయంలో మహిళలు కుంకుమ పూజలు

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ సందడి

ధర్మపురి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో శుక్రవారం భక్త జన సందడి నెలకొంది. వరలక్ష్మి శుక్రవారం కూడా కావడంతో అనేక మంది భక్తులు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరి నదీ తీరాన గల సంతోషీమాత, మహాలక్ష్మి, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయాల్లో ఉపావాస దీక్షతో ఉన్న మహిళలు ఉద్యాపన పూజలు, కుంకుమ పూజలు జరిపారు. ఆలయ అర్చకులు కొరిడె బాలక్రిష్ణ, మధ్వాచారి రాధికాపవన్ అమ్మవారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల యాగశాల వద్ద ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మోహనాచార్యా. విజయ్ లక్ష్మీ హవనం నిర్వహించారు. అనేక మంది భక్తులు అమ్మవారలతో పాటు లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ ఆలయాల్లో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ పాల్గొన్నారు.



గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

ఆదివాసీ జీవన చిత్రాలు





- ఫొటోగ్రఫీలో సిగ్మా శేఖర్ అంతర్జాతీయ ఖ్యాతి
- వెయ్యికు పైగా అవార్డులు.. 100 అంతర్జాతీయ అవార్డులు..
- నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

అడవితోనే జీవనం, ప్రత్యేకమైన వస్త్రధారణ, అటవీ సంపద, పోడు వ్యవసాయం జీవనాధారంగా మానవ జాతికి అనవాళ్లుగా ఆదివాసీలు, గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. అమాయకత్వమే వారి అభరణం.. మూగ జీవాలు వారి నేస్తాలుగా ఇంకా అనేక ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్ల వంటి మౌలిక సదుపాయాలు లేక జీవనం సాగిస్తున్నారు. అడవుల్లో వాగులు, కొండలు, పచ్చని ప్రకృతి ఒడిలో సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వీడకుండా జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనుల బతుకు చిత్రాలను తన కెమెరాలో బంధించిన సిరి సిల్లకు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రాఫర్ ఎంసీ శేఖర్‌పై శనివారం ఆదివాసీ దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..





ఆదివాసీ, గిరిజనుల బతుకు చిత్రాలు..

దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివాసీ, గిరిజనుల జీవన శైలిని, వారి బతుకు చిత్రాలను కెమెరాలో బంధిస్తూ ఫొటోగ్రఫీ రంగంలో శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను అందుకున్నారు. సిరిసిల్లలో సిగ్మా ఫొటోస్టూడియోతో ఛాయాచిత్ర రంగంలో అడుగుపెట్టిన మేర్గ శేఖర్ అంతర్జాతీయ స్థాయిలో అనేక అవార్డులను అందుకోవడంతోపాటు పలు దేశాల్లో ఫొటోప్రదర్శనలు నిర్వహించారు. సిగ్మా పేరే శేఖర్‌కు సిరిసిల్లలో ఇంటి పేరుగా మారిపోయింది.

ఇప్పుడు సిగ్మా అకాడమి స్థాపించి ఔత్సాహికు ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తూ వారి ఎదుగుదలకు తోడ్పడుతున్నారు. ఫొటోగ్రఫీ రంగంలో 1992 నుంచి 2024 వరకు పలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. 1000కి పైగా అవార్డులు, 100 అంతర్జాతీయ పురస్కారాలను, 300 మెరిట్ సర్టిఫికెట్‌లను అందుకున్నారు. సిగ్మా ద్వారా 200 పైగా వర్క్ షాప్‌లు నిర్వహించారు. ఢిల్లీ నగరంతో పాటు అనేక ప్రాంతాల్లో శేఖర్ విభిన్నంగా తీసిన దాదాపు 1650 ఫొటోలతో ఎగ్జిబిషన్లు నిర్వహించారు.



శేఖర్ (ఫైల్)

పత్తిలో కలుపు మందు పిచికారికి ప్రత్యేక ఏర్పాట్లు

పాలకుర్తి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని కన్నాల గ్రామంలోని రైతులు పత్తిలో కలుపు మందు పిచికారి చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ విధానంతో పత్తి మొక్కలపై కలుపు మందు పడకుండా కలుపు మొక్కల నివారణ జరుగుతుందని ఏఈవో శశిధర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక పరికరం వాడు తున్న రైతులతో మాట్లాడుతూ పత్తి విత్తిన 20 నుంచి 60 రోజుల వరకు చేనులో కలుపు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాగళ్లతో గాని, కూలీల సహాయంతోగాని 60 రోజుల వరకు కలుపు లేకుండా చూసుకున్నట్లయితే పత్తి ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పరికరంతో పత్తి మొక్కలపై గడ్డి మందు పడకుండా పిచికారీ చేసుకోవచ్చన్నారు. కలుపు ఉండడం వల్ల పత్తి మొక్కలకు వేసిన రసాయన ఎరువులు ఆ మొక్కలకే పోతాయన్నారు. రైతులు సట్ల కనుకయ్య, సముద్రాల పోచయ్య, మొం డయ్య, సాయిలు, బాదావత్ తిరుపతి పాల్గొన్నారు.



ప్రత్యేక పరికరంపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శశిధర్

సిట్ విచారణకు హాజరైన బీజేపీ నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో పాటు సిట్ విచారణకు హాజరవుతున్న పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు

భగత్‌నగర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ విచారణకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రావు మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ విషయంలో విచారణ నిమిత్తం పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన ఫోన్ ట్యాప్ చేయడం దుర్మార్గమన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని విచారణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నెలల తరబడి సాగదీస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ జరిపించే విడిచిపేట్టేది లేదని స్పష్టం చేశారు.

ముగిసిన టేబుల్ టెన్నిస్ పోటీలు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు కొత్తపల్లి ఆల్ఫోర్స్ పాఠశాలలో శుక్రవారం ముగిసాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల నుంచి 500 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. టీఎం ఈవెంట్ అండర్-14 విభాగంలో వీపీఎస్ పబ్లిక్ స్కూలు (విజయవాడ) ప్రథమ స్థానం, టైం స్కూలు(రంగారెడ్డి) ద్వితీయ స్థానం సాధించాయి. అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ స్కూల్ (తూర్పు గోదావరి) ప్రథమస్థానం, సర్ సీఆర్ స్కూల్(పెద్దాపురం, పశ్చిమ గోదావరి) ద్వితీయ స్థానం, అండర్-19 విభాగంలో శ్రీప్రకాశ్ స్కూలు (తూర్పుగోదావరి)ప్రథమస్థానం, సర్ సీఆర్ రెడ్డి స్కూల్ (పెద్దాపురం, పశ్చిమగోదావరి) ద్వితీయ స్థానాలు సాధించాయి.

వ్యక్తిగత విభాగంలో అండర్-14లో శీలం మనస్వి ప్రథమ స్థానం, అండర్-17 విభాగంలో ఎం. శాంతిజ్యోతి ప్రథమ, అండర్-19 విభాగంలో ఎం.దర్శిక ప్రథమ స్థానం సాధించారు. ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక అభి వృద్ధి లభిస్తుందన్నారు. క్రీడలు ఒత్తిడి నుంచి తట్టుకునే శక్తిని అందిస్తాయన్నారు. క్రీడల్లో రాణించినవారు, చదువులోనూ ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పోటీల పరిశీలకులు పద్మారావు, చీఫ్ రెఫరీ శంకర్, అసోసియేట్ రెఫరీ రాంచంద్రారావు, అంపైర్లు బాబురావు, ఒతినేలు, ఎండీ గౌస్, రామ్మూర్తి, రవి, గంగారాం, పాఠశాలల కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారు.



సీబీఎస్ఈ టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలతో అతిథులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు.

సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలలో గెలు పొందిన విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో ఎస్.మనస్వి, రిద్ధిటోరో, కె.నైనా, వంశిక, అండర్-17 విభాగంలో జి.వర్షిక, ఎస్. తనిష్క, ఎం.దాస్, మిద్ది శాంతి జ్యోతి, అండర్-19 విభాగంలో టి.సాయిసుదీక్ష, కె. రిషికాతులసి, ఎం. మాండవ లినేషియా, ఎం.దర్శిక ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.

సమసమాజ స్థాపనకు గద్దర్ అలుపెరగని కృషి

తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

హుజూరాబాద్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సమసమాజ స్థాపనకు ప్రజా యుద్ధనౌక గద్దర్ అలు పెరగని కృషిచేశారని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో శనిగరం బాబ్జీ ఆధ్వర్యంలో గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా వెన్నెల గద్దర్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి సిటీ సెంట్రల్‌హాల్ వరకు ర్యాలీగా వచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రాంత ప్రజల విముక్తి కోసం తూటాను మోసిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్నారు. గద్దర్ ఆశ, ఆశయం సమ సమాజ నిర్మాణం స్వేచ్ఛ, సమానత్వం పోరా టాలు చేశారన్నారు. ఉస్మానియా యూని వర్సిటీ విద్యార్థి నుంచి జన నాట్య మండలి సాంస్కృతిక సేనానిగా పాటను ఆయుధంగా ఎక్కుపెట్టి ప్రజా ఉద్యమాలు జరిపారన్నారు. కారంచేడు హత్యాకాండ జరిగిన ప్పుడు దళితులకు ధిక్కారం నూరిపోశారన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్

జీవితమంతా ప్రజా పోరాటాల్లో గడిపి న గద్దర్‌ను 75ఏళ్ల వయసు వరకు 32 పోలీసు కేసులు వెంటాడా యన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని గద్దర్ తన పాటా, ఆటలతో ఉర్రూతలూగించిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. నిత్యం ప్రజాపోరా టాలతో ముందుకు సాగిన ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సభలో కళాకారులు పాడిన పాటలు ఆహూతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సమావేశంలో ఆవునూరి సమ్మయ్య, ముక్కెర రాజు, జీడీ సార య్య, బండ శ్రీనివాస్, మురళీ మధు, రాములు, తిరుపతయ్య, కళాకారులు, కవులు, మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం..



ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

వీర్నపల్లి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ పంటతో రైతులకు అధిక ఆదాయం వస్తుందని వీర్నపల్లి వ్యవసాయ విస్తరణ అధికారి ఫజిల్ అన్నారు. వీర్నపల్లి మండలం కంచర్ల గ్రామంలో రైతు పెంచ్యాల నర్సింగం ఆయిల్‌పామ్ పంట మొద టి దిగుబడి రావడంతో అధికారులు, రైతులు శుక్రవారం పరిశీ లించారు. జిల్లాలోనే మొదటిసారి ఆయిల్‌పామ్ పంట కోతకు వచ్చిం దన్నారు. మొద టిదశలో సుమారు 4 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చినట్లు ఏఈవో తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో ఆర్థిక ఎదుగుదల అధికమవుతుందని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రస్తుతం మార్కెట్లో టన్నుకు రూ.18,500 ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఆయిల్ పామ్ క్లస్టర్ అధికారి పవన్, ఏఎంసీ డైరెక్టర్లు చంద్రమౌళి, నరేష్, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,062 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 5,062 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వాటర్ వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తోడు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో గోదావరి నీరు ప్రాజెక్టులోకి వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 40.304 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ అవసరాలకు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 5,983 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఇందులో కాకతీయ కాలువకు 2,350 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 113 క్యూసెక్కులు, అలీసాగర్ ఎత్తిపోతల పథకానికి 240 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 112 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 225 క్యూసెక్కులు, వరద కాలువకు 2,250 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. 462 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో వ్యయం అవుతోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 31.859 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి వివిధ అవసరాల నిమిత్తం 4.343 టీఎంసీల నీరును వ్యయం చేశారు.

నోరూరిస్తున్న పిండి వంటలు..

వరుస పండుగలు... శుభకార్యాలు

తయారీదారులకు పెరిగిన గిరాకీ





అమ్మకానికి సిద్ధంగా ఉన్న గారెలు, మురుకులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఈ ఆగస్టు మాసంలో వరుసగా పండుగలతో పాటు (వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి, వినాయకచవితి) శుభకార్యాల జోరు ఊపందుకుంది. ఇందుకు ఎన్ని పదార్థాలు వడ్డించినా పిండి వంటలు రుచి చూపాల్సిందే! పిల్లలు, పెద్దలు సైతం తినుబండారాలకు దాసులే! పిల్లలకైతే స్నాక్స్ రూపంలో కూడా ఉపయోగపడుతాయి. ఇతర ప్రదేశాలకు టూర్ వెళ్లే వారికి కూడా బాగా పనికి వస్తాయి. దీనికి జిల్లా వాసులు శ్రమ లేకుండా పలు షాపుల్లో, హోం ఫుడ్ సెంటర్లలో తయారైన పిండి వంటలను, పలు పచ్చళ్లను ఆశ్రయిస్తున్నారు. అందుబాటులో ధరలకే వంటకాలను అందిస్తుండటంతో అటు తయారీ దారులకు గిరాకీ పెరుగుతోంది. చేయి తిరిగిన మనుషులతో శుభ్రమైన పదార్థాలు ఏ రోజుకారోజు తయారీ చేసి విక్రయిస్తున్నారు. మరో వైపు విదేశాల్లో ఉన్న తమ వారికి ప్యాకింగ్ చేసి కూడా పంపుతు న్నారు. సుమారు 50కి పైగా తీయని, కారపు వంట కాలు అమ్ముతుండగా వినియోగదారులు కిలోల చొప్పున తీసుకుంటున్నారు. చిప్స్ మొదలు అప్పాల వరకు, గవ్వలు మొదలు లడ్డూల వరకు వివిధ సైజుల్లో అమ్ముతున్నారు. వెరైటీని బట్టి కిలోకు ఒక్కో పిండి వంటకం కనిష్ఠ ధర రూ.280 నుంచి గరిష్ఠ ధర రూ.350 వరకు పలుకుతున్నాయి.

ఉధృతంగా పల్వంచ వాగు

గంభీరావుపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పల్వంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వస్తోంది. మానేరు జలాశయం నీటి మట్టం రోజు రోజుకు పెరుగుతోంది. శుక్రవారం నాటికి ఎగువ మానేరు నీటి మట్టం 23 ఫీట్లకు చేరింది. మానేరు పూర్తిగా నిండేందుకు మరో 8 ఫీట్ల నీరు కావల్సింది ఉంది. మానేరు నిండుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.



● సంక్షిప్తంగా..

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6గంటలకు ఐఎంఏ హాల్‌లో పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ సీహెచ్ విజయకుమార్ ఆతిథ్యంలో 148వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష కార్యదర్శులు సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

-జిల్లాకుచెందిన రచయిత, విమర్శకుడు, తెలుగు భాషోపాధ్యాయుడు కూకట్ల తిరుపతి రచించిన, సంపాదకత్వం వహించిన సుమారు 20వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను శుక్రవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశంకు అందజేశారు.

ఇల్లందకుంట: మండలంలోని సీతంపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సభ, ఆరోగ్యమహిళ కార్యక్రమం నిర్వహించారు. వైద్యసిబ్బంది మహిళలకు రక్తపరీక్షలు చేశారు.

వీణవంక: మండలంలోని ఎల్బాకలో గ్రామస్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కోఆర్డినేటర్ సుజాత ఆధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు.

జమ్మికుంట రూరల్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీలో మేదరిసంఘం జిల్లా అధ్యక్షుడు మధిర రవీందర్ తల్లి రామమ్మ రెండోవర్ధంతి సందర్భంగా 30 మంది మహిళాకార్మికులకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ శుక్రవారం చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని కేసీ క్యాంపులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన, శాంతి కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.విగ్రహదాతలను ఘనంగా సన్మానించారు.

- గంజాయి వద్దు.. ఆరోగ్యంముద్దు అంటూ హుజూరాబాద్‌లో సామాజిక కార్యకర్త నలుబాలవేణుగోపాల్ శుక్రవారం విస్తృతప్రచారం నిర్వహించారు. డ్రగ్స్, గంజాయి పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలన్నారు.

సైదాపూర్: యూరియా కోసం రైతులు ఎలాంటి ఆందోళనలకు గురికావద్దని మండల వ్యవసాయాధికారి వేదేహి అన్నారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పలు దఫాలుగా యూరియా అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

భగత్‌నగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు మహిళామోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సుజాతారెడ్డి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

- ఫోన్‌ట్యాపింగ్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను సిట్‌బృందం విచారణ జరుపుతున్న నేపథ్యంలో కరీంనగర్ నుంచి బీజేపీ శ్రేణులు పెద్దఎత్తున హైదరాబాద్ తరలివెళ్లాయి.

గణేశ్‌నగర్: ప్రపంచంలో భారత్ బలీయ శక్తిగా ఎదుగడానికి ముఖ్య కారణం కుటుంబ వ్యవస్థే అని ఏబీజీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగమల్ల సురేష్ తెలిపారు. మార్కెట్ రోడ్‌లోని వెంకటేశ్వర మందిరంలో ఏబీజీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

ఒకే గది.. 5 తరగతులు

- ప్రభుత్వ బడిలో పరిస్థితి
- విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు



ఒకే గదిలో కూర్చున్న విద్యార్థులు, వెనకాల సామగ్రి

చిగురుమామిడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామం లాలాయ్యపల్లి ప్రైమరీ పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. ఇలా ఐదు సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు 22మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా దళిత సామాజిక వర్గానికి చెందినవారే. ఒక తరగతికి బోధించే సమయంలో ఇత తరగతుల విద్యార్థులు బయట ఉండాల్సిందే. ఈ సందర్భంలో కొంతమంది విద్యార్థులు ఇదే అదనుగా భావించి ఇంటికెళ్లిన సందర్భాలు ఉన్నాయి. చుట్టూ పారిశుధ్యం లోపించి, విషపూరితమైన కీటకాలతో విద్యార్థులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

విద్యార్థులకు, ఉపాధ్యాయులకు..

ఐదు తరగతుల విద్యార్థులు చదువకోవడం ఒకటైతే.. ఇదే గదిలో రికార్డులు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సామగ్రి ఉంటాయి.. ఇక విద్యార్థులు కూర్చోవడానికి స్థలం అనేది దాదాపుగా ఉండదు. ఇదే విషయంపై ఉపాధ్యాయులు అనేక సార్లు అధికారులకు చెప్పినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది.

పట్టించుకోవడం లేదు..

తాళ్ల నరేష్ మహారాజ్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్

ఈ పాఠశాలలో చదువుకునే విద్యార్థులందరూ దళితులే. తరగతి గదులు నిర్మించాలని ఎన్నో సార్లు చెప్పినా పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలి.

అదనపు గదుల కోసం విన్నవించాం

- పావణి, ఎంఈవో

సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. అదనపు తరగతులను మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నివేదికలను అందించాం. తొం దరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉన్నది.

వైభవంగా దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిచాలలో శుక్రవారం దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజర య్యారు. వేదపండితులు ఆయన ఘన స్వాగతం పలికి సన్మానించినారు. అనంతరం ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సైతం కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు. నిర్వాహకులు వీర్ల సరోజన-ప్రభాకర్, సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

మండల కేంద్రంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గోపాల్‌రావుపేట అల్ఫోర్స్ పాఠశాలలో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. అనంతరం రాఖీ పండుగ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమస్యల పరిష్కార వేదిక శుక్రవారం మహాసభ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సమస్యలన్నింటికీ శుక్రవారం సభ ఒక పరిష్కార వేదికగా నిలుస్తోందని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ మండలం కాశ్మీర్‌గడ్డ మొదటి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ మహిళల సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, గర్భిణులు, బాలింతలు శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని సూచించారు పీడీపీవో సబితా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యతోపాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించే ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్ సఫీర్ హుస్సేన్, అర్బన్ సీడీపీవో సబిత, అసిస్టెంట్ కమిషనర్ దిలీప్, మెప్మా శ్రీవాణి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను శుక్రవారం అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీచేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్‌ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, ఎంఐఎం ప్రతినిధి అబ్బాస్ షమీ, బర్కత్ అలీ, టీడీపీ ప్రతినిధి కళ్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెలరీషో ప్రారంభం



జోయలుక్కాస్ జ్యూవెలరీని ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

భగత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో జోయాలుక్కాస్ బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెలరీ షోను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జాయ్ లుక్కాస్ మాట్లాడుతూ కరీంనగర్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యూవెలరీ షోను తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈప్రసిద్ధి చెందిన ఎగ్జిబిషన్‌లో ఉత్తమమైన డిజైన్, స్టైల్‌లతో సంబరం చేస్తుందన్నారు. ప్రత్యేకమైన డైమండ్, ప్రెషస్ జ్యూవెలరీని అన్వేషించడానికి విలక్షణమైన అవకాశాన్ని అందిస్తుందన్నారు. పరిమితమైన డిజైన్స్ ఎగ్జిబిషన్ సమయంలో మాత్రమే లభిస్తాయన్నారు. ప్రత్యేకమైన ఆఫర్‌గా రూ. 1 లక్ష, అంతకంటే ఎక్కువగా ప్రతీ డైమండ్ జ్యూవెలరీ కొనుగోలుతో ఉచితంగా ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను అందుకుంటారన్నారు. ఎగ్జిబిషన్ కరీంనగర్ జోయాలుక్కాస్ షోరూంలో ఉంటుందన్నారు. ఈ నెల 24వరకు ప్రణాళిక చేశామని తెలిపారు.

మీ డ్రామాలు ఆపండి

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం/తిమ్మాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఇక మీ డ్రామాలను ఆపండని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బీఆర్‌ఎస్ నాయకులనుద్దేశించి అన్నారు. శుక్రవారం 70మంది లబ్ధిదారులకు సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులు అందుబాటులో ఉన్నా బీఆర్‌ఎస్ నాయకులు పదుల సంఖ్యలో యూరియా బస్తాలు కావాలంటూ సెంటర్‌ల వద్ద కొరతను సృష్టిస్తున్నారన్నారు. ఏవో కిరణ్మయి, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మానకొండూర్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి 17,18వ విడతల్లో మానకొండూర్ నియోజకవర్గానికి కోటి92లక్షలు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మానకొండూర్‌లోని రైతువేదికలో చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ఓదెలు ఉన్నారు.

తిమ్మాపూర్: ఎల్‌ఎండీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మండలానికి చెందిన 148మందికి రూ.42లక్షల 17వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులతోపాటు 18మందికి కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు ఎస్‌ఎల్ గౌడ్,రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాలు

ఇల్లందకుంట/జమ్మికుంట/హుజూరాబాద్/చిగురుమామిడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలాల్లో గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జమ్మికుంట వెంకటాద్రి నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళలు సామూహిక పూజలు చేశారు. ఆలయ ప్రధానాచార్యులు వరలక్ష్మి అమ్మ వారికి అష్టోత్తర పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. హుజూరాబాద్ పట్టణంలో వాసవి మెన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అమ్మవారికి చీరసారె సమర్పించారు. చిగురు మామిడి మండల వ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో, ఇళ్లల్లో శుక్రవారం వరలక్ష్మివ్రతాన్ని మహిళలు ఘనంగా నిర్వహించు కున్నారు.



చిగురుమామిడిలో పూజలు చేస్తున్న మహిళలు

కార్పొరేషన్‌కు ఆటోల అందజేత

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అర్బన్ లైవ్ ఫుడ్ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ నగరపాలక సంస్థకు రెండు ఎలక్ట్రికల్ ఆటోలను బహూకరించారు. ఈ ఆటోలను కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ శుక్రవారం ప్రారంభించారు. నగరంలోని తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించేందుకు ఈ ఆటోలను ఉపయోగించనున్నారు. డిప్యూటీ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్లు స్వామి, రమేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ మృతి పార్టీకి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న వొడితెల సతీష్‌కుమార్

చిగురుమామిడి, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేకొండకు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్, గ్రామ రజక సంఘం అధ్యక్షుడు దుడ్డెల లక్ష్మినారాయణ అకాలమృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ అన్నారు. శుక్రవారం గ్రామంలో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహంపై బీఆర్‌ఎస్ జెండాను కప్పి నివాళి అర్పించారు. లక్ష్మినారాయణ కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదు కుంటామన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ ఎంపీటీసీ కత్తుల రమేష్ యాదవ్, మాజీ సర్పంచ్‌లు సన్నీల్ల వేంకటేశం, లక్ష్మణ్, బొయిని శ్రీనివాస్, బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, బీఎస్పీ, ధర్మస మాజ్, టీడీపీ నాయకులు తదితనేలే పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి



స్థానికులతో మాట్లాడుతున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షపాతి అని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మానేరు జలాశయం కట్ట దగ్గరలోని హస్నాపురం, బతుకమ్మ కాలనీల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారికి భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రాజెక్టుల భద్రతకు సంబంధించి నిబంధనలు ఉన్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2021 సంవత్సరంలో డ్యామ్ సేఫ్టీ ఆక్ట్ తీసుకురావడంతో నిబంధనలు కఠినతరం చేశారని, దీనిలో భాగంగానే సెంట్రల్ వాటర్ కమిషన్ డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ ఏర్పాటు చేసి వారి ద్వారా పరిశీలన చేపించి 200 మీటర్ల లోపల నిర్మాణం చేసుకున్న వారికి ఇరిగేషన్ అధికారుల ద్వారా నోటీసులు జారీ చేశారని అన్నారు. అన్నీ తెలిసిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఏదో జరిగిపోతున్నట్టు మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం పాలనసాగుతోందని, ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు ఎక్కడా ఎటువంటి అన్యాయమూ జరుగదని అన్నారు. నాయకులు తాజ్, శ్రవణ్ నాయక్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కొట్టె ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో సందడి

● వరలక్ష్మి వ్రతాలు... ముందస్తు రాఖీ వేడుకలు



విద్యార్థులతో అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు, ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి వేడుకలు ప్రారంభించారు. పారమిత విద్యాసంస్థల్లో ఎకో ఫ్రెండ్లీ రాఖీల పోటీలు నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

విద్యానగర్ సిద్ధార్థ పాఠశాలలో వరలక్ష్మీ వ్రతాలు, రాఖీ వేడుకలు జరిగాయి. ఫౌండర్స్ డే వేడుకల్లో భాగంగా విద్యాసంస్థల రూపశిల్పి దాసరి నరసింహారెడ్డి స్మారకార్థం సివిల్ హాస్పిటల్‌లో అన్నప్రసాద వితరణ చేశారు. చైర్మన్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, డైరెక్టర్ స్వప్న పాల్గొన్నారు.

హనుమాన్‌నగర్ బ్లూబెల్స్‌లో ప్రిన్సిపాల్ జంగ సునీతామనోహరరెడ్డి పాల్గొన్నారు. సరస్వతీ శిశుమందిర్‌లో వేడుకల్లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మానేరు విద్యాసంస్థల్లో చైర్మన్ కడారి అనంతరెడ్డి పాల్గొన్నారు. సరస్వతీనగర్ స్టార్ కిడ్స్ ప్రీ స్కూల్‌లో చైర్మన్ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: నగరంలోని కోరా జాన్సన్, ఏఎస్ పాఠశాలల్లో చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి వేడుకలను నిర్వహించారు.

భగత్‌నగర్: కరీంనగర్‌లోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమా రెడ్డి, ప్రిన్సిపాల్‌లు భార్గవ్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కోతిరాంపూర్‌లోని అచీవర్స్ యాక్టివ్ పాఠశాలలో డైరెక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పల్లవి పాల్గొన్నారు.

భగత్‌నగర్: కరీంనగర్‌లోని విజన్ హై స్కూల్‌లో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. నగునూరులోని దుర్గామాత గుడిలో పూజలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, డైరెక్టర్లు సందవేణి వెంకట్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, ఇన్‌చార్జి ప్రతిభ భారతి పాల్గొన్నారు.



రాఖీలు కడుతున్న వింధ్యావాలీ విద్యార్థులు



వేడుకల్లో సెయింట్ జార్జ్ స్కూల్ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్: జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్‌లోగల వింధ్యావ్యాలీ ఉన్నత పాఠశాలలో ముందుస్తు రాఖీ సంబరాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్, పాల్గొన్నారు.

చొప్పదండి/జమ్మికుంట/తిమ్మాపూర్: మండలంలో ఎమ్మెల్యే క్యాంప కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి స్వరూప ఆధ్వర్యంలో, ప్రైవేటు పాఠశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో, చొప్పదండి గిర్వాని పాఠశాలలో వేడుకలను నిర్వహించారు

జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో పట్టణ సీఐ రామకృష్ణగౌడ్‌కు మహిళా పోలీస్ సిబ్బంది రాఖీకట్టారు. తిమ్మాపూర్ మహాత్మాజ్యోతిబాపూలే గురుకులంలో సహజసిద్ధమైన రాఖీలను తయారు చేశారు.

హుజూరాబాద్: పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ స్కూల్లో రక్షాబంధన్, వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. చైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పండుగల విశిష్టతను వివరించారు.

జిల్లాలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం

(5వ పేజీ తరువాయి)

ప్రకటించి కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పరిచింది. జిల్లాలో విదేశీ మారకద్రవ్యాన్ని సమకూర్చి పెట్టే గ్రానైట్ పరిశ్రమ ఉంది. ఇక్కడ సుమారు 250 గ్రానైట్ క్వారీలు, 400 ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి ఏటా కోట్లలో ఆదాయం సమకూరుతున్నది. చైనా తదితర దేశాలకు ఇక్కడ నుంచి కాకినాడ పోర్టు ద్వారా గ్రానైట్ ఎగుమతి జరుగుతున్నది. విదేశాల నుంచి గ్రానైట్ రాయి కొనుగోలుకు వ్యాపారులు రావడం ఇక్కడ నుంచి ఆయా ప్రాంతాలకు వెళ్లడానికి హైదరాబాద్ ఎయిర్‌పోర్టే ఆధారంగా ఉన్నది. రామగుండం పారిశ్రామిక ప్రాంతం కరీంనగర్‌కు 70 కిలోమీటర్ల పరిధిలోనే ఉండడం, ఉమ్మడి జిల్లా పరిధిలో పుణ్యక్షేత్రాలైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం, ధర్మపురి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఉన్నాయి. వ్యవసాయకంగా అభివృద్ధి చెంది వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిలుస్తున్నది. ఇక్కడ నుంచి బియ్యం ఎగుమతి గణనీయంగా ఉన్నది. ఈ ప్రాంతవాసులు వేలాది మంది గల్ఫ్ దేశాల్లో అమెరికా, ఆస్ట్రేలియా, కెనడా, దుబాయి, తదితర దేశాల్లో ఉన్నారు. విద్యార్థులు వేల సంఖ్యలో ప్రతి ఏటా విదేశాలకు వెళుతుంటారు. ఈ ప్రాంతంలో విమానశ్రయ ఏర్పాటు చేస్తే వారందరికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఉమ్మడి జిల్లా పరిధిలో మూడు ప్రభుత్వ వైద్య కళాశాలలు, రెండు ప్రైవేట్ వైద్య కళాశాలలు ఉండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వైద్య విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. వీరందరి ప్రయాణాలకు కూడా ఈ ఎయిర్‌పోర్ట్ ఉపయోగపడుతుంది. బసంత్‌నగర్‌లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయడం వీలు కాదని తేలిన నేపథ్యంలో ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐ, సింగరేణిలో పనిచేసే వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి ఈ ఎయిర్‌పోర్ట్ దగ్గరగా ఉండి వారి ప్రయాణ అవసరాలు తీర్చే వీలు కలుగుతుంది.

జిల్లాస్థాయి చేతిరాత పోటీలు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో చేతిరాత పోటీలను కరీంనగర్‌లోని పారమిత పాఠశాలల సహకారంతో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు విడివిడిగా పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈ నెల 20న, మండలస్థాయిలో 25న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు జిల్లాస్థాయిలో సెప్టెంబరు 7న పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్‌లో ఉదయం 10 గంటల నుంచి 10:45 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కొత్తపల్లి ఎస్‌హెచ్‌వోగా కోటేశ్వర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీసు ఠాణా ఎస్‌హెచ్‌వోగా సీఐ బిల్ల కోటేశ్వర్ బదిలీ అయ్యారు. కరీంనగర్ ఒకటో ఠాణా సీఐగా పనిచేస్తున్న బిల్ల కోటేశ్వర్‌ను కమిషనరేట్ స్పెషల్ బ్రాంచి(సీఎస్‌బీ), అటాచ్‌గా కొత్తపల్లి పోలీసు ఠాణాకు బదిలీ చేశారు. ఇప్పటి వరకు సీఎస్‌బీగా పనిచేస్తున్న జి.శ్రీనివాస్‌ను రామగుండం వీఆర్‌కు బదిలీ అయ్యారు. కొత్తపల్లి ఎస్సై స్థాయి ఠాణా అయినప్పటికీ సీఐని అటాచ్‌గా పోస్టింగ్ ఇవ్వడంతో ఈ ఠాణాకు స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా సీఐగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

బస్‌స్టేషన్‌లో రద్దీని పరిశీలించిన ఆర్టీసీ అధికారులు

భగత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, రీజినల్ మేనేజర్ రాజు పరిశీలించారు. రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ రామకృష్ణ, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, రామకృష్ణ రాజయ్య పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని అడిషనల్ డీసీపీ వెంకట రమణ అన్నారు. శుక్రవారం జమ్మికుంట మండలం మడిపల్లిలో హుజూరాబాద్ ఏసీపీమాధవి, సీఐ రామకృష్ణగౌడ్ కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు, నంబర్‌ప్లేట్ లేని 59ద్విచక్ర వాహనాలు, అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీ నం చేసుకున్నారు. ముగ్గురు సీఐలు, ఆరు గురు ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌లో కౌన్సిల్ ప్రమాణ స్వీకారోత్సవం



బాధ్యతలు స్వీకరిస్తున్న విద్యార్థులు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఇన్వెస్టిచర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 2025-26 సంవత్సరానికి ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులకు పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించి శుభాకాంక్షలు తెలిపారు. వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. హెచ్ఓడీ మురళీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బబిత విశ్వనాథన్ పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ బ్యూటీషియన్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలోగల దుర్గాబాయి శిశువికాస కేంద్రంలో కమర్షియల్‌గా అడ్వాన్స్‌డ్ బ్యూటీషియన్ కోర్సులు ప్రారంభించనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ సుధారాణి ప్రకటనలో తెలిపారు. కోర్సు కాల వ్యవధి 3నెలలు అని మరిన్ని వివరాలకు 8500616491, 9846785355 కార్యాలయం సమయం ఉదయం 10నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలని పేర్కొన్నారు.

దివ్యాంగుల ఉపాధి కల్పనకు ఉచిత శిక్షణ

గన్నేరువరం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉపాధిని కల్పించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో వివిధరకాల ఉపాధి పనులపై ఉచి తంగా శిక్షణను ఇవ్వనున్నట్లు యూత్ 4 ఫౌండేషన్ సంస్థ తెలంగాణ అసిస్టెంట్ మేనేజర్ మొహమ్మద్ షాహిద్, మోరె కృష్ణ తెలిపారు. గురువారం మండలకేంద్రంలో దివ్యాంగులకు ఉపాధి కల్పనపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వివరాలకు 9281152803 నంబరును సంప్రదించాలని సూచించారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి

సుభాష్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు తొలగించాలని ఇరిగేషన్‌శాఖ అధికారులు జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని తారక హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ 200 మీటర్ల దూరంలో నిర్మాణాలు చేపట్ట కూడదని ఇరిగేషన్ అధికారులు ఇప్పుడు నోటీసులు పంపిస్తున్నారని, ఇన్ని సంవత్సరాలపాటు వారికి అవి కనిపించలేదా అని ప్రశ్నించారు. వారంతా మానేరు డ్యాం కట్టిననాటి నుంచే అక్కడ నివసిస్తున్నారని తెలిపారు. నోటీసులు ఎవరు ఇప్పించారో బయటపెట్టాలన్నారు. లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో కేమసారం తిరుపతి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై స్పందించాలి

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని విద్యారంగ సమస్యలపై అధికారులు స్పందించాలని స్టూడెంట్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ తెలంగాణ క్యాంపస్ కార్యదర్శి మెహమ్మద్ తాజ్ కోరారు. శుక్రవారం జమాతే ఇస్లామీహింద్ సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, డీఈఓలకు వేరువేరుగా వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. ఎస్ఐవో కరీంనగర్ అధ్యక్షుడు సమాన్ రాఫిద్, నగర కార్యదర్శి మొహమ్మద్ అలీ పాల్గొన్నారు.

సిటిజన్ కాలనీ రోడ్డును బాగు చేయండి

కరీంనగర్ రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బొమ్మకల్ పరిధిలోని సిటిజన్ కాలనీ రోడ్డు ప్రమాదకరంగా మారిందని, గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరించాలని కాలనీకి చెందిన సయ్యద్ ముజాఫర్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌కి వినతి పత్రం అందజేశారు.